నమస్తే తెలంగాణ
మన పత్రిక మన ఆత్మగౌరవం

DATE -27-DECEMBER-2014

PAGE NO-09

# ఇన్‌కాయిస్‌ను పటిష్ఠంచేస్తాం

- శాస్త్ర, సాంకేతిక రంగాలను తీర్చిదిద్దుతాం
- కేంద్రమంత్రి డాక్టర్ హర్షవర్ధన్
- హైదరాబాద్ నగరం సురక్షితమని వ్యాఖ్య



హైదరాబాద్/ దుండిగల్, డిసెంబర్ 26 (టీ మీడియా): సముద్ర తీరప్రాంతాల రక్షణకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాఖల మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. సముద్ర గర్భంలో చోటు చేసుకునే పరిణామాలను ఎప్పటికప్పుడు గుర్తించి తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఇన్‌కాయిస్‌ను మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అరక్షిత (వల్నరేబుల్) ప్రాంతాల ప్రతిబింబాలను సేకరించేందుకు జీఐఎస్ ఆధారిత 3డీ మ్యాపింగ్ ప్రొటోకాల్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో సుమారు 26 శాతం మంది ప్రజలు సముద్ర తీర ప్రాంతాల్లో నివాసముంటున్నారని, ప్రకృతి విపత్తులపై వారికి ముందస్తు సమాచారం అందజేయాల్సిన బాధ్యత సునామీ కేంద్రంపై ఉందన్నారు. కుత్బుల్లాపూర్ మండలం ప్రగతినగర్ సమీపంలోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం (ఇన్‌కాయిస్) ఆవిర్భవించి పదేండ్లు పూర్తయిన సందర్భంగా 'ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం ప్రొగ్రెస్-చాలెంజెస్ అండ్ ఫ్యూచర్ రోడ్ మ్యాప్' అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ విచ్చేశారు. ఆ శాఖ సహాయ మంత్రి వైఎస్ చౌదరి (సుజనా చౌదరి)తో కలిసి హాజరై వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ సేవలపై రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి హర్షవర్ధన్ మీడియాతో మాట్లాడుతూ.. ఇన్‌కాయిస్ ముందస్తు సమాచారం ఇవ్వడం వల్లే హుధూద్ తుపాన్ నుంచి ప్రాణనష్టం సంభవించకుండా కాపాడగలిగామన్నారు. హైదరాబాద్ మహానగరం సురక్షిత ప్రాంతంలో ఉందని.. ఇక్కడ భూకంపం, తుపాన్, సునామీవంటి విపత్తులు సంభవించే అవకాశం లేదని అన్నారు. ఇక్కడ నివాసముంటున్నవారు అదృష్టవంతులని పేర్కొంటూ వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈఎస్ఎస్‌వో ఇన్‌కాయిస్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ను మంత్రులు ప్రారంభించి.. మొక్కలు నాటారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (ఎంవోఈఎస్) సెక్రటరీ డాక్టర్ శైలేశ్‌నాయక్, మాజీ కార్యదర్శులు డాక్టర్ హెచ్‌కే గుప్తా, డాక్టర్ పీఎస్ గోయల్‌తోపాటు ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ షెనాయ్ పాల్గొన్నారు.

### బయో టెక్నాలజీతో కొత్త ఆవిష్కరణలు

బయో టెక్నాలజీతో కొత్త ఆవిష్కరణలు చేపట్టడానికి దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయని కేంద్ర ఐటీశాఖ మంత్రి హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన కేంద్రమంత్రి హర్షవర్ధన్‌ను శాసన సభా పక్షనేత డాక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సన్మానించాయి. ఈ సందర్భంగా కేంద్ర ఐటీశాఖ మంత్రి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగంలో భారత దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలువబోతున్నదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అనేక వినూత్న పరిశోధనలకు మన దేశం వేదిక కాబోతున్నదని అన్నారు. ఇప్పటికే దేశాన్ని పోలియోరహిత దేశంగా తయారు చేశామని తెలిపారు.